

ఉష్ణోగ్రత (అంచనా) 22-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	37	29
నరసరావుపేట	38	28
బాపట్ల	36	29
రెంటచింతల	37	28
చీరాల	36	29

నరసరావుపేటే మిగిలింది..!



చిలకలూరిపేట ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

- నేషనల్ హైవే భూ సేకరణ జఠిలం..!
- హైకోర్టులో రైతుల పిటిషన్‌లు
- పరిహారంపై ఒప్పందం చేయాలని పట్టు
- అంగీకరించని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వాడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారి భూ సేకరణ జఠిలమవుతోంది. నరసరావుపేటలో నష్టపరిహారం విషయంలో అధి కార యంత్రాంగం, రైతుల మధ్య వివాదం కొనసా గుతోంది. భూ సేకరణపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ.. రైతులు హైకోర్టును ఆశ్ర యించారు. పిటి షన్లను ఉపసంహరించుకోవాలని రైతులతో ఉన్నతాధికారులు జరిపిన చర్చలు విఫల మ య్యాయి.

వేగంగా ఫేజ్ 1 పనులు

బాపట్ల జిల్లా వాడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. 85 కిలో మీటర్ల పొడవునా రూ.1,064 కోట్ల వ్యయంతో ఈసీపీ విధానంలో రహదారి నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) పనులు నిర్వహిస్తోంది. రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు రూ.678 కోట్లతో 47 కిలో మీటర్ల ప్యాకేజీని ఆర్‌ఆర్‌ఎస్‌ఎం సంస్థ చేపట్టింది.

● వివాదంగా 279.16 ఎకరాల భూసేకరణ

నరసరావుపేటలో రహదారి నిర్మాణానికి 279.16 ఎకరాల భూమి అవసరం. ఈ మేరకు సర్వే పూర్తి చేసి సంబంధిత రైతులకు భూసేకరణ నోటీసులు జారీ చేశారు. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పో తున్న బాధితులతో ఆర్డీవో కా ర్యాలయంలో ఇటీవల సమా వేశం నిర్వహించారు. నరస రావుపేట పట్టణం పరిధి లో ఉన్న వ్యవ సాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంట గార్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ విలువపై రెండున్నర రేట్లు పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో బాధితులకు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్ల స్థలాలకు గజానికి రూ.19 వేలు, రహదారికి లోపల ఉన్న ఇళ్ల స్థలాల కు రూ.16 వేలు చెల్లిస్తామని ఆర్డీవో వివరించారు. ఎకరాకు సుమారు రూ.1.75 కోట్లు పరిహారం చెల్లిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత పత్రాలను అధికారులు స్వీకరించారు. ఆర్డీవో ప్రకటించిన విధంగా లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇస్తే భూములు.. స్థలాలు ఇస్తా మని బాధితులు చెబుతున్నారు. లిఖితపూర్వకంగా ఇవ్వలేమని.. సదరు ధరలను నేషనల్ హైవే అథార్టీ అధికారులకు ప్రతిపాదిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కోర్టులో కేసులు ఉపసంహరించుకోవాలని సూచించారు. పరిహారం లిఖిత పూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇవ్వా లని బాధితులు కోరడంతో.. ప్రతిష్టంభన కొనసాగుతోంది. నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలో 85.39 ఎకరాలు, జొన్నలగడ్డలో 37.15, నరసరావుపేటలో 33.55, గుంటగార్లపాడులో 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.


167ఏ జాతీయ రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగంగా జరుగుతున్నాయి. పల్నాడు జిల్లాలో నరసరావుపేటలో మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. కొన్ని చోట్ల రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్టప రిహారాన్ని కూడా జమ చేశారు. ఎటొచ్చి నరసరా వుపేటలో బైపాస్ భూసేకరణ మొదటి నుంచి వివాదంగానే ఉంది. సర్వే రాళ్లను తొలగించడం, భూముల్లో మార్కింగ్ చేయకుండా రైతులు అడ్డుకుంటూ వస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం అలైన్‌మెంట్ మార్చ డం కుదరని పని అని రైతులకు తేల్చిచెప్పారు.

● చిలకలూరి పేటలో..

చిలకలూరిపేట కొత్త బైపాస్ నుంచి అడ్డరోడ్డు వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తయింది. కావూరు నుంచి కన పర్రు వరకు భూసేకరణకు రైతులు అంగీకరించారు. కొందరు రైతు లకు నష్టపరిహారం వివరాల నోటీసులు కూడా అందజేశారు. కావూరులో 49.15, నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76 ఎకరాలు, గణపవరంలో 5.80, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91, రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రైతులు కూడా సానుకూలంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫేజ్-2లో ఇలా..

రెండవ ప్యాకేజీలో రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. చిలకలూరిపేట కొత్త బైపాస్ దగ్గర నుంచి ఈ పనులు ప్రారంభమవుతాయి. ఇందులో పాత రహదారిని విస్తరిస్తారు. ఈశ్వర కళాశాల దగ్గర కుడి వైపునకు నరసరావుపేట బైపాస్ ప్రారంభమవుతుంది. 14.4 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు. కుప్పగంజి వాగు మీదుగా టిడ్కో ఇళ్ల సమీపంలో రైల్వే లైన్ వద్ద ఆర్‌వోబీని, నరసరావుపేట -గుంటూరు రోడ్డు వద్ద ఫ్లైఓవర్, ఇస్సపాలెం దగ్గర సత్తెనపల్లి రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తారు. రావిపాడు తర్వాత ఉన్న రహదారిలో కలుస్తుంది. అక్కడ నుంచి ఉన్న రహదారిని విస్తరిస్తారు. అడ్డరోడ్డు దగ్గర బైపాస్ నిర్మిస్తారు. ఇదే గ్రామం వద్ద ఇంటర్ చేజ్ నిర్మించి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో కలుపుతారు.



ప్రభుత్వానికి చెందిన ఎద్దుల బీడు

భూ ఆక్రమణల్లో రికార్డులు..!

- పల్నాడులో అడ్డగోలుగా వైసీపీ నేతల అక్రమాలు
- రెవెన్యూ రికార్డుల్లో మార్పులు
- పూర్వార్జిత ఆస్తి చేర్పులు
- ప్రభుత్వ భూములను తనఖా పెట్టి రుణాలు
- విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం

పిడుగురాళ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లాలో భూ దందా యథేచ్ఛగా కొనసాగింది. కొందరు వైసీపీ నేతలు ప్రభుత్వ, పట్టా భూములను ఇష్టానుసారంగా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి పూర్వార్జితపు ఆస్తులుగా నమోదు చేయించారు. ఆపై తనఖా పెట్టి బ్యాంకుల నుంచి రూ.లక్షల కొద్దీ రుణాలు పొందారు. ఈ వైనం గత ఐదేళ్ల గురజాల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొనసాగింది. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులే అప్పటి అధికార పార్టీ నేతలు చెప్పినట్లు తలూపారు. వీఆర్‌ఏ నుండి తహసీల్దార్ వరకు ఈ స్వామిభక్తి కొనసాగింది.

యథేచ్ఛగా రెవెన్యూ రికార్డులు తారుమారు..

దాచేపల్లి మండలం పొందుగల సమీపంలోని ఎద్దుల బీడు సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతలు ఇందులో కొంత భాగాన్ని రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు మీద నమోదు చేసుకున్నారు. మరికొంత మంది దొంగ పట్టాలు సృష్టించుకొని బ్యాంకుల్లో రుణాలు కూడా పొందారు.

■ ఇదే మండలంలోని తంగెడ గ్రామంలో సర్వే నంబరు 1184/4లో ప్రభుత్వ పాఠశాల భూమిని దాచేపల్లికి చెందిన ఓ వైసీపీ నేత రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసి.. దాచేపల్లి సహకార బ్యాంక్‌లో తాకట్టుపెట్టి రుణం కూడా పొందాడు.

■ తంగెడ గ్రామ సర్వే నంబర్లు 5, 10, 100, 1000, 1006 లోపు వందలాది ఎకరాలు షేక్ తండా సైదా సాహెబ్ పేరుతో గతంలో రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

■ మాచవరం మండలం పులిచింతల ముంపు గ్రామాలు రేగులగడ్డ, గోవిందాపురం గ్రామాలోని ప్రాజెక్టుకు చెందిన కొంత భూమిని పిడుగురాళ్లకు చెందిన కొందరు రెవెన్యూ రికార్డులో తమ పూర్వీకుల ఆస్తిగా నమోదు చేసుకున్నారు. పట్టా భూముల రైతులను బెదిరించి తమ వర్గీయుల పేరిట మార్పించి పంచుకున్నారు.

■ దాచేపల్లి మండలంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీ కొనుగోలు చేసిన భూములను ఇదే మండలానికి చెందిన కొందరు వైసీపీ నేతలు బెదిరించి.. స్వాధీనం చేసుకుని.. అదే భూమిని తిరిగి ఫ్యాక్టరీకి విక్రయించిన ఉదంతాలూ ఉన్నాయి.

■ మాచవరం మండలంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలిరోజే టీడీపీ వర్గీయులకు చెందిన వందలాది ఎకరాల పట్టా భూములను అక్కడి వైసీపీ నేతలు రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చి హస్తగతం చేసుకున్నారు. బ్యాంకుల్లో తనఖా పెట్టి.. రుణాలు కూడా పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిగా రెవెన్యూ అధికారుల చుట్టూ ఆ గ్రామస్థులు తిరుగుతున్నప్పటికీ.. ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మాత్రం మారలేదు.

■ పిడుగురాళ్ల మండలం బైపాస్ రహదారికి సమీపాన ఉన్న ప్రభుత్వ భూములను, చెరువు స్థలాన్ని వైసీపీ నేతల అనుచరులు ఆక్రమించి అమ్మకాలను కొనసాగించారు.

వారంలో విచారణ కమిటీ : కలెక్టర్ అరుణ్‌బాబు

గురజాల నియోజకవర్గంలో 2019-24 కాలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, బ్యాంక్ రుణాలపై విచారణకు వారం రోజుల్లో పులిచింతల స్పెషల్ కలెక్టర్, జేసీ, రెవెన్యూ సర్వే శాఖల అధికారులను నియమిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు.

రికార్డుల పరిశీలన

ప్రభుత్వ భూముల ఆక్ర మణలు, రెవెన్యూ రికార్డుల తారుమారుపై సర్వే నంబర్ల వారీగా పరిశీలిస్తాం. ఇందులో రెవెన్యూ అధికారుల తప్పిదం ఉన్నట్లు గుర్తిస్తే చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

- మురళీకృష్ణ, ఆర్డీవో



వైసీపీ హయాంలో జరిపిన గ్రావెల్ తవ్వకాలు

ఎన్టీఆర్ ఆశయ సాధనలో ముందుకు

- వేడుకగా పల్నాడు జిల్లా టీడీపీ మహానాడు
- వెనకడుగు లేదు కాబట్టే అధికారం: మంత్రి గొట్టిపాటి
- ఐకమత్యమే మహాబలం: చీఫ్ విప్ జీవీ
- పార్టీ బాగుంటేనే మనం బాగుంటాం: ఎంపీలావు



కార్యక్రమానికి హాజరైన పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర నాయకులు



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

నరసరావుపేట టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ పెట్టి తొమ్మిది నెలల్లో అధికారంలోకి తీసుకొచ్చిన ఏకైక నాయకుడు నందమూరి తారక రామారావు అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో జిల్లా టీడీపీ మహానాడు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హాల్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదు విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అనంతరం జరిగిన సభకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు సమాన హక్కులు, పేదలకు పక్కా గృహాలు ఇలా ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. 1983లో టీడీపీ ఎంత మెజార్టీతో అధికారంలోకి వచ్చిందో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కనివిని ఎరుగని విధంగా 90 శాతానికిపైగా సీట్లతో 2024లో విజయం సాధించామని గుర్తుచేశారు. వైసీపీ వాళ్లు ఎంత ఇబ్బంది పెట్టినా వెనకడుగు వేయకుండా పనిచేశాం కాబట్టే పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగామని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్లను కృష్ణానదికి కలిపి... దేశంలో మొట్టమొదటిసారిగా నదులు అనుసంధానానికి శ్రీకారం చుట్టారన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టును జిల్లాకు తీసుకువచ్చి సాగునీటికి ఏవిధంగా ఇబ్బంది లేకుండా చేయాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కోటి సభ్యత్వాలతో.. కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్టీఆర్ మార్గంలో వెళ్తున్నాం: చీఫ్‌విప్ జీవీ

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని చెప్పిన అన్న ఎన్‌టీఆర్ మార్గంలో ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తూ.. ఉన్నత పదవులు, బాధ్యతలు టీడీపీలో అప్పగిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తల పోరాటం, నియంతకు దీటైన సమాధానంతో వైసీపీని బంగాళాఖాతంలో కలిపామన్నారు. రూ.10 లక్షల కోట్లు అప్పులో కూడా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచితగ్యాస్ సిలిండర్లు అందజేస్తుందని స్పష్టం చేశారు. ఐకమత్యమే బలం అని జనసేన, బీజేపీ నాయకులను కూడా కలుపుకొని వెళ్లాలని సూచించారు. ప్రతి ఇంటి కి ఒక పారిశ్రామికవేత్తను చేయాలనేది సీఎం ముందున్న లక్ష్యమని తెలిపారు.

పార్టీ బాగుంటేనే అందరం బాగుంటాం : ఎంపీ లావు

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ గత ఎన్నికలు యుద్ధ వాతావరణాన్ని తలపించాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోరుకుంటుందని, ప్రజలు నమ్మారు కాబట్టి అఖండ మెజారిటీతో పట్టం కట్టారని చెప్పారు. అంతిమంగా పార్టీ బాగుంటేనే మీరైనా, తానైనా బాగుండేదని స్పష్టం చేశారు. మన పని మనం చేసుకుంటూ పోతే ప్రజలే మనల్ని గుర్తిస్తారన్నారు. వైసీపీ నేతల తీరు బయట బెదరిస్తారని, లోపల కాళ్లు పట్టుకుంటారనేలా ఉంటుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా.. పల్నాడులో తెలుగుదేశం జెండా ఎగరేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్, ఎస్కే కరిముల్లా, మిరియాల రత్నకుమారి, నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అమీర్‌వలి, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్.. ఎన్టీఆర్‌కు భారతరత్న

జిల్లా మహానాడులో తీర్మానాలకు ఆమోదం

నరసరావుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) : మహానాడులో ముందుగా వీర జవాన్లు, ఉగ్రదాడి లో మృతి చెందిన భారత పౌరులు, గత రెం డేళ్లలో మరణించిన టీడీపీ నాయకులు, కార్య కర్తలకు సభలో పార్టీ శ్రేణులు నివాళులర్పించాయి. సమావేశంలో జిల్లా ప్రగతికి సంబంధించిన పలు తీర్మానాలను మహానాడు సభ ఏక గ్రీవంగా అమోదం తెలిపింది.

- యువగళం పాదయాత్ర ద్వారా గత ప్రభుత్వ తప్పుల్ని ఎండగడుతూ ప్రజల్ని చైతన్య వంతుల్ని చేసి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావ డానికి కీలక పాత్ర పోషించిన యువ నాయకుడు, మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ వర్కిం గ్ ప్రెసిడెంట్ హోదా ఇవ్వాలని, పార్టీ వ్యవ స్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామా రావుకు భారతరత్న ఇవ్వాలని మహానాడులో చేసిన తీర్మానాలను ఏకగ్రీవంగా అమోదించారు.
- వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం. గోదావరి జలాలను మళ్లించి పల్నాడు, రాయలసీమ ప్రజల దాహార్తి తీర్చడం.
- హరిశ్చంద్రాపురం వద్ద కృష్ణానదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి గోదావరి జలాలను నకరికల్లు వద్ద నాగార్జునసాగర్ ప్రధాన కుడి కాలువకు మళ్లించాలి.
- నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ పరిధిలోని పిచ్చి కంప చెట్లు తొలగించి, పూడిక తీసి, పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి. జిల్లాలో నాగార్జునసాగర్, కొండవీడు కోట, ఇతర దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.
- నరసరావుపేట పట్టణంలో ఆటోనగర్, ఆటో పార్క్, ట్రక్ టెర్మినల్, ఔటర్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలి.
- గత ప్రభుత్వ విధానాలతో కుంటుపడిన నూలు పరిశ్రమకు ప్రోత్సాహక బకాయిలను ప్రభుత్వం అందించి పునర్జీవం ప్రసాదించాలి. సుగంధ ద్రవ్యాలు, టెక్స్ టైల్ పార్క్‌ల అభివృద్ధి, లెదర్ పార్క్‌లను ఏర్పాటు చేయాలి.
- జిల్లా కేంద్రం సమీపంలోని కాకాని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరణ.

యోగా జీవితంలో భాగం కావాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావు పేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్ప విద్య యోగాను.. ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. రోజుకు 30 నిమిషాలు యోగాకు కేటాయించడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. జూన్ 21న నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా యోగాంధ్ర మాసోత్సవాలను స్థానిక డాక్టర్ కోడెల శివప్రసాద్ క్రీడా ప్రంగణంలో వెయ్యి మందితో యోగా చేయించి, జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారు. యోగాసన శిక్షకులు కూనంశెట్టి వెంకట జనార్దన్, యోగా బోధకులు ఆనంద రాముడు, డైట్ అధ్యాపకుడు అజయ్ కుమార్‌లను శాలువాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు సత్కరించారు.

యోగ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు



కారు ఢీకొని కూలి మృతి : మరొకరికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో బుధవారం జరిగింది. వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన శ్రీనివాస్(37), జోసెఫ్ కూలీ పనుల నిమిత్తం తమ ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి పట్టణంలోని గడియార స్తంభం దగ్గరకు వచ్చారు. ఇదే సమయంలో ఎదురుగా వసస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్ పై ప్రయాణిస్తున్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా.. జోసెఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జోసెఫ్‌ను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. జోసెఫ్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి, ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు బోగీలు

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ పెరిగిన కారణంగా తిరుపతి, ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు బోగీలను రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. (17253/17254) గుంటూరు - ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్ క్లాస్, (17261/17262) గుంటూరు - తిరుపతి - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు స్లీపర్, జనరల్ బోగీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా బెర్తులు, సీట్లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.

మాచర్ల ప్యాసింజర్‌లో సాంకేతిక లోపం



మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు

మాచర్లటౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ (57204) రైలు ఇంజన్‌లో బుధవారం సాంకేతిక లోపం తలెత్తింది. రెండున్నర గంటల అనంతరం మరొక ఇంజన్‌ను తెప్పించి విజయవాడకు రైల్వే అధికారులు రైలును నడిపారు. సాధారణంగా సాయంత్రం 4:30 గంటలకు మాచర్లలో బయలు దేరి విజయవాడకు రాత్రి 10:30 గంటలకు చేరాల్సి ఉంది.

కాసులిస్తేనే కనెక్షన్..!



● వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో చేతివాటం ● క్షేత్రస్థాయిలో ఆపరేషన్ అధికారులపై ఆరోపణలు ● పేరుకుపోతున్న దరఖాస్తులు ● ఉమ్మడి జిల్లాలో 4 వేలకు పైనే పెండింగ్

గుంటూరు, మే 21(ఆంధ్రజ్యోతి): కాసులిస్తే రోజుల వ్యవధిలోనే కనెక్షన్‌లు. లేకుంటే ఏదో ఒక కొర్రీతో కాలం వెళ్లదీయడం... ఇదీ వ్యవసాయ కనెక్షన్‌లలో క్షేత్రస్థాయి విద్యుత్ శాఖ ఆపరేషన్ అధికారుల తీరుపై వెల్లువెత్తుతోన్న ఆరోపణలు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు కావాలంటే ఆ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ కనెక్షన్‌లు త్వరితగతిన అందించాలని పదే పదే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆపరేషన్(ఓ అండ్ ఎం) అధికారులు మాత్రం 'చేయి తడపనిదే.. మాకేంటి' అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం విద్యుత్ శాఖకు డిపాజిట్లు కూడా చెల్లించిన దరఖాస్తులు 2024-25కు సంబంధించి 4 వేలకు పైనే ఉన్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక గత 2023-24 సంబంధించి ఇంకా 60 పైనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

డిపాజిట్లు చెల్లించినా..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం రైతులు దరఖాస్తులు చేసుకోగా ప్రతిపాదనలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఎర్త్ పైపులు వంటి అనేక పరికరాల కోసం డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు పక్కాగా డిపాజిట్లు చెల్లించినప్పటికీ ఏదో ఒక సాకుతో కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ కనెక్షన్‌లపై క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు దరఖాస్తు దారులు స్థానిక అధికారులను కలిసి కాసులిస్తేనే కరుణిస్తారన్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని సబ్ డివిజన్‌లలో దరఖాస్తు చేసుకున్న కనెక్షన్లకు సామగ్రి డ్రా చేసినట్లుగా ఉంటోంది. క్షేత్రస్థాయిలో మాత్రం వేరొకరికి కనెక్షన్‌లు ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ తతంగమంతా స్థానిక అధికారులు, సిబ్బంది కనుసన్నల్లో జరుగుతోన్నట్లు ఆరోపణలున్నాయి.

నందివెలుగు - అత్తోట మధ్యలో రైతులకు చుక్కలు...

తెనాలిలోని నందివెలుగు - అత్తోట మధ్యలో నలుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం గత ఏడాదిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందు కోసం అధికారుల పంపిన నోటీసుల ప్రతిపాదనలకు అనుగుణంగా ఒక్కొక్కరు జూలైలో రూ. 18వేలకు పైనే చెల్లించారు. అక్కడి నుంచి తమకు అధికారులు చుక్కలు చూపించారని వారు వాపోతున్నారు. నాలుగు కనెక్షన్‌లకు గాను నేటికీ ఒక్క సర్వీసుకు మాత్రమే కనెక్షన్ ఇచ్చారని తెలిపారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేసిన నాలుగు నెలల తరువాత తిన్నగా విద్యుత్ పోల్స్ వేశారని చెప్పారు. మరో నెల తరువాత ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉంచారు. కొన్ని రోజుల తరువాత ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటు చేసి వైర్లు లేవని మరి కొంతకాలం జాప్యం చేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు ఇటీవల ఒక్క సర్వీసుకు కనెక్షన్ ఇచ్చారని, చివరగా వేరొక సర్వీసుకు ఏర్పాటు చేసిన పోల్స్‌ను కూడా లాక్కెళ్లారని సదరు రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆయా సర్వీసుల విషయంలో క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం ఏబీ కేబుల్, సాధారణ కేబుల్, ఎర్త్ పైపులు కూడా డ్రా చేసినట్లు సమాచారం. అయినప్పటికీ నాలుగు సర్వీసులకు కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యమెందుకో పైఅధికారులకే తెలియాలి.

ఎస్ఈ చెప్పినా బేఖాతరు

నంది వెలుగు - అత్తోట మధ్యలో వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన రైతులు పలు మార్లు తమ గోడును ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలో ఎస్ఈ స్పందించి స్థానిక అధికారులకు గట్టిగా చెప్పనప్పటికీ స్థానిక అధికారులు లెక్కపెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వం మారినా వారే..

ఏపీ సీపీడీసీఎల్ ఉమ్మడి గుంటూరు జిల్లా సర్కిల్ పరిధిలోని పలు డివిజన్‌లలో ముఖ్యంగా ఆపరేషన్(ఓ అండ్ ఎమ్) విభాగంలో గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన వారే అత్యధిక శాతం కొనసాగుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు నేటికీ అదే బాటలో నడుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జీరో, కటింగ్ బిజినెస్‌ల లెక్క తేల్చారు సరే...

● మరి బిల్ టూ బిల్, పార్టనర్‌షిప్ మార్పుల సంగతేమిటి? ● మచ్చుకాయల రూపంలోనూ పెద్దఎత్తున గోల్‌మాల్ ● వీటి పైనా విజిలెన్స్ రిపోర్టు ఇస్తే మొత్తం అవినీతి ఎంతనేది తేలుతుంది



గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇంకా కొన్ని లెక్కలు తేల్చాల్సి ఉన్నది. ఇప్పటివరకు కేవలం జీరో, కటింగ్ బిజినెస్‌ల ద్వారా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, వాణిజ్య పన్నుల శాఖలు కోల్పోయిన ఆదాయాన్ని మాత్రమే లెక్కించాయి. అయితే బిల్ టూ బిల్, మచ్చుకాయలు, లైసెన్సుల పేర్ల మార్పుల్లో జరిగిన అవినీతిని మాత్రం ఇంకా తేల్చాల్సి ఉన్నది. వాటి లెక్క కూడా పూర్తి అయితే అవినీతి దాదాపుగా రూ. 400 కోట్ల వరకు చేరొచ్చని అంచనా. వీటిని ఏ విధంగా రికవరీ చేస్తారనేది సస్పెన్స్‌గా మారింది. కాగా ఉద్యోగులపై చర్యలు తీసుకొన్నంత మాత్రాన యార్డు ఖజానాకు ఏమి ఒరగదు. ఆర్ఆర్ యాక్టు ప్రయోగించి రికవరీ చేస్తేనే ఉపయోకరమన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

మిర్చియార్డులో బిల్ టూ బిల్ వ్యాపారం పెద్దఎత్తున ఏడాది పొడవునా అన్ని పనిదినాల్లో కొనసాగుతుంటుంది. దీని వలన రైతుకు భారీగా నష్టం జరుగుతుంది. యార్డులో తగినంత ఆర్థికస్తోమత లేకపోయినా చాలామంది కమీషన్ ఏజెంట్ లైసెన్సులు పొందారు. వాళ్ల వద్దకు వచ్చే మిర్చి టిక్కీలను అమ్మి పెట్టలేక పెద్ద కమీషన్ ఏజంట్లకు చెప్పి బిల్ టూ బిల్ రాయిస్తారు. ఇందుకు గాను రైతుల వద్ద 2 శాతానికి బదులు ఐదు శాతం కమీషన్ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం పెద్ద కమీషన్ ఏజంట్‌కు, 2 శాతం ఆర్థికస్తోమత లేని ఏజంట్‌కు చేరుతుంది. ఈ విధానం వలన మిర్చియార్డుకు ఎలాంటి నష్టం జరగడం లేదు కదా అని వ్యాపారస్థులు వాదిస్తుంటారు. యార్డుకు వచ్చే 1 శాతం మార్కెట్ ఫీజు వస్తుంది కదా అని ప్రశ్నిస్తుంటారు. అయితే రైతుకు చెల్లించే నగదులో మూడు శాతం అదనంగా కోత పెడతారు. దీని వలన కూడా మార్కెట్ ఫీజు, జీఎస్టీ రూపంలో గండి పడుతుంది. ఈ విధంగా బిల్ టూ బిల్ లావాదేవీలు 2019-24 మధ్యన ఎంతమేరకు జరిగాయో తేలిస్తే యార్డు ఆదాయానికి పడిన గండి ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉన్నది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో కమీషన్ ఏజంట్ల లైసెన్సులకు సంబంధించి పార్టనర్‌షిప్ మార్పులు 250కి పైగా జరిగాయి. ఇందుకోసం రూ. కోట్లలో నగదు చేతులు మారిందన్న ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. దీనిపై అప్పటి యార్డు చైర్మన్లను విజిలెన్స్ అధికారులు కలెక్టరేట్‌లోని ప్రాంతీయ కార్యాలయానికి పిలిపించి ఎంక్వయిరీ కూడా చేశారు. అయితే విజిలెన్స్ రిపోర్టులో ఎక్కడా ఈ బిల్ టూ బిల్, పార్టనర్‌షిప్ మార్పులు గురించి ప్రస్తావించలేదు. నిత్యకృత్యంగా మారిన మచ్చుకాయలు తీసే విధానం జోలికి కూడా విజిలెన్స్ వెళ్లలేదు. ఇవన్ని లెక్కలు తేలిస్తే అవినీతి ఇప్పటికే లెక్కించిన రూ. 347.70 కోట్లకు అదనంగా మరో రూ. 100 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా.

వేమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రకటన

వేమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. నూతన పాలకవర్గం తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు పదవిలో కొనసాగుతుందని ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే ఆనందబాబు, పాలకవర్గ అధ్యక్షురాలిగా అమృతలూరుకు చెందిన గొట్టిపాటి జయపూర్ణకుమారి, వేమూరు మండలం కాకర్లమూడికి చెందిన అమ్మిశెట్టి కిషోర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సభ్యులుగా.. మూల్పూరుకు చెందిన మొవ్వా శ్రీనివాసరావు, అమృతలూరుకు చెందిన కందుకూరి వెంకటేశ్వరమ్మ, వేమూరుకు చెందిన గంటా రమాదేవి, జంపనికి చెందిన వట్టిప్రోలు సునీత, చుండూరు మండలం మోదుకూరుకు చెందిన ఆళ్ల కోటిరెడ్డి, మండూరుకు చెందిన భార్గవి, కొల్లూరు మండలం జువ్వలపాలేనికి చెందిన భూపతి వెంకటేశ్వరరావు, గాజుల్లంకకు చెందిన సనకా నాగమణి, కొల్లూరుకు చెందిన పోతార్లంక కుటుంబరావు, భట్టిప్రోలు మండలంలోని ఆళ్లమూడికి చెందిన రాజుల వెంకటేశ్వరరావు, భట్టిప్రోలుకు చెందిన షేక్ జమీల, యర్రంశెట్టి సత్యనారాయణ, ఐలవరానికి చెందిన గట్టు రామలక్ష్మి సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షులు, వేమూరు సర్పంచ్, రేపల్లె వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ అధికారి సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మహానాడు కార్యక్రమం అనంతరం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం ఉంటుందని సమాచారం. నూతన పాలక వర్గం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపింది.



అమ్మిశెట్టి కిషోర్



గంటా రమాదేవి



వట్టిప్రోలు సునీత

ముగిసిన ఎన్టీఆర్ కళా పరిషత్ నాటిక పోటీలు

వినుకొండటౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ వజ్రోత్సవాల్లో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన నాటక పోటీలు పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ సన్నివేశాల్లో మహిళలు, చిన్నారుల కళా ప్రదర్శన అలరింపజేసింది. చివరి రోజు హైదరాబాద్ వారి విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ స్వేచ్ఛ నాటిక, 2వ ప్రదర్శనగా సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటిక, 3వ ప్రదర్శనగా విశాఖపట్నం వారి భద్రం ఫౌండేషన్ ప్రదర్శించిన దొందూదొందే హాస్య నాటికలను ప్రదర్శించారు. నాటిక పోటీలకు సహకరించిన దాతలను నిర్వాహకులు శాలువాలతో సన్మానించి, అభినందించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కళలకు వినుకొండ పెట్టింది పేరు అని, జాషువా పుట్టిన గడ్డపై ఇలాంటి ప్రదర్శనలు ఎన్నో కొనసాగాలన్నారు. ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకటకోటయ్య, న్యాయవాది రామకోటేశ్వరరావు, లగడపాటి వెంకట్రావు, ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తితో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



దేవరాగం నాటికలోని ఓ సన్నివేశం



స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

కిల్కారి సేవలను పరిశీలించిన
ఆర్మాన్ కేంద్ర బృందం



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

గుంటూరు మెడికల్, మే 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న కిల్కారి కాల్స్ సేవలను బుధవారం ఆర్మాన్ కేంద్ర బృందం పరిశీలించింది. తొలుత బృంద సభ్యులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి కిల్కారి సేవల అమలు తీరు వివరించారు. అనంతరం ఈ బృందం సంగం జాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో కిల్కారి ప్రోగ్రాం అమలు తీరును గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఆశలు, ఆరోగ్య కార్యకర్తలు ఏవిధంగా సేవలు అందిస్తున్నారు... కిల్కారి మొబైల్ కాల్స్ ఆరోగ్య సంరక్షణలో ఏ మేరకు ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మాతా శిశుమరణాలు తగ్గించేందుకు కిల్కారి ఫోన్ కాల్స్ సేవలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు ఈ బృందం సభ్యులు గర్భిణలకు వివరించారు. 01244451660 అనే నంబరు నుంచి కిల్కారి ఫోన్ కాల్స్ వస్తాయని, ఈ కాల్స్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సమాచారాన్ని అందిస్తారని వివరించారు. బృందం వెంట డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డీఐవో డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

ఇంటెల్ సంస్థతో ఎన్ఈసీ అవగాహన ఒప్పందం



ఇంటెల్ ప్రతినిధులతో ఎన్ఈసీ కళాశాల వైస్ చైర్మన్ చక్రవర్తి

నరసరావుపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి):నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల మైక్రోప్రాసెసర్ సంస్థ ఇంటెల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఘనత సాధించిన తొలి ఇంజనీరింగ్ కళాశాలగా నరసరావుపేట కళాశాల నిలిచిందని వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా "ఇంటెల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్"ను ఆనంద్ కులకర్ణి, కస్టమర్ ఇంజనీరింగ్ లీడ్, ఇంటెల్ (బెంగళూరు) కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణలు, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు ఇంటెల్ సర్టిఫికేషన్లు వంటి అనేక అవకాశాలు ఈ ఒప్పందం ద్వారా అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మొదటి విడతలో 50 మం ది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేశారని, మరో 50 మంది రెండో విడతకు ఎంపికయ్యారన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, సెక్రటరి మిట్టపల్లి రమేష్‌బాబు ఈ ఇంటర్నేషనల్ భాగస్వామ్యాన్ని కళాశాల అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా పేర్కొన్నారు.

పల్లెల్లో ప్రశాంతత నెలకొల్పాలి

- పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



పల్లె నిద్రలో పాల్గొన్న ఎస్పీ శ్రీనివాసరావు

వెల్దుర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఘర్షణలకు దూరంగా ఉంటూ పల్లెల్లో ప్రశాంతతను నెలకొల్పాలని జిల్లా ఎస్పీ కంచె శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గుండ్లపాడులో బుధవారం రాత్రి ఆయన పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఘర్షణల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఐక్యమత్యంతో ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. జోరు వానలోనూ గొడుగు సాయంతో గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని సచివాలయంలో పల్లె నిద్ర చేశారు. ఎస్పీ వెంట గురజాల డీఎస్పీ హనుమంతురావు, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి, సిబ్బంది ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

దుర్గి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలను బుధవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన లెక్కించారు. 57 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన ఆదాయం రూ.31,30,423గా తేలింది. పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ ఈవో సీహెచ్ శివనాగిరెడ్డి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

పీహెచ్‌సీ రికార్డుల తనిఖీ

రెంటచింతల, మే 21(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె.రవిరత్నాకర్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రాబోయే వర్షాకాలంలో మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంక్షేమ హాస్టల్‌లో మలాథియాన్ స్ప్రే చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హేమ, ఆరోగ్యపర్యవేక్షకులు అంకమ్మరావు, కోటేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్‌గా బాలస్వామి

రెంటచింతల, మే 21(ఆంధ్రజ్యోతి): రెంటచింతల సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్‌గా గోవిందు బాలస్వామిని నియమిస్తూ జిల్లా మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటిదాకా కరస్పాండెంట్‌గా వ్యవహరించిన పీటర్ పాపయ్య ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు. బాలస్వామి జూన్ 6న ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నట్లు చెప్పారు.

చింతలతండాలో అధికారుల దాడులు

● 10 మంది అనుమానితుల బైండోవర్

మాచర్ల రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలతండాలో బుధవారం ఎక్సైజ్ ఎస్‌ఐ షరీఫ్, మాచర్ల రూరల్ ఎస్‌ఐ నరసింహ, విజయపురిసౌత్ ఎస్‌ఐ మహ్మద్ షఫిలు నవోదయం 2.వో కార్యక్రమంలో భాగంగా దాడులు జరిపారు. గ్రామానికి చెందిన 10మంది అనుమానితులను మాచర్లలో మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. డీటీ వాణి వారిని బైండోవర్ చేశారు. మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి, మాచర్ల, దుర్గి మండలాల్లోని గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా మార్చడానికి ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 22.21 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

మాచవరం ఎస్‌ఐగా రోశయ్య


ఎస్‌ఐ ఎం రోశయ్య

మాచవరం, మే 21(ఆంధ్రజ్యోతి): మాచవరం మండల నూతన ఎస్‌ఐగా ఎం రోశయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సతీష్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. గుంటూరులో రైల్వే పోలీసు విభాగంలో పనిచేస్తూ పదోన్నతి పై మాచవరం ఎస్‌ఐగా రోశయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉండేలా కృషి చేస్తానన్నారు.

మోర్జంపాడు టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా కావూరు

మాచవరం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కావూరి పిచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో పిచ్చయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పల్నాడులో వర్షం

పిడుగురాళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): పల్నాడు డివిజన్‌లో బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే వుంది. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో వర్షం భాగా కురిసింది. రైతులు సాగుచేయనున్న పంట దుక్కులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగకరం కానున్నది. పట్టణంలోని ప్రధానడ్రెయిన్లు వ్యర్థాలతో నిండిపోవడంతో వర్షపు నీరు ప్రధానరహదారిపైనే పారుతుండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

● రాజుపాలెం, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో భారీవర్షం కురిసింది. బుధవారం ఉదయం 11గంటల నుండి సుమారు రెండు గంటల పాటు వర్షం కురవటంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రెడ్డిగూడెం గ్రామ సమీపంలో ఉన్న ఆర్‌యూబీలో భారీగా వర్షపునీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని సమీప గ్రామాలు బ్రాహ్మణపల్లి, మొక్కపాడు ప్రజలు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం

నరసరావుపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళలో ఖాళీగా ఉన్న స్థలంను 15 సంవత్సరాలు వాపారాల నిమిత్తం అద్దె ప్రాతిపదికన జోనల్ ఎఫ్‌సీ కార్యాలయం, నెల్లూరు వారి ద్వారా టెండర్లుకు ఆహ్వానించారు. ఈ నెల 23న ఉదయం 11.00 గంటలకు పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి చాంబర్‌లో పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు తెలిపారు. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ ప్రాంగణంలో 0 ఎస్-15 ప్రాతిపదికన స్థలాలపై పారిశ్రామిక వేత్తలకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యం

● అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు చర్యలు
● సీసీ కెమెరాల ఏర్పాటుకు యరపతినేని రూ.10 లక్షలు కేటాయింపు


డ్రోన్లతో పహారా కాస్తున్న పోలీసు అధికారులు

గురజాలటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన గృహాల్లో దొంగతనాలు.. ఖాళీ ప్రదేశాల్లో మద్యం బాబుల వీరంగాలు.. పల్లెల్లో ఘర్షణలు.. గురజాల మండలంలో నిన్నటి వరకు పరిస్థితి. అభివృద్ధితోపాటు ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సొంత నిధులతో నిఘా నేత్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. మొదటగా గురజాల నగర పంచాయతీ ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రదేశాలు, మొత్తం మండల పరిధిలో 112 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. గురజాల నగర పంచాయతీ పరిధిలో 36 సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. పట్టణంలో ప్రధానంగా బ్రహ్మనాయుడు సెంటర్, రైల్వేస్టేషన్, బస్టాండ్, కాలేజీ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, లక్ష్మీ టాకీస్ సెంటర్ తదితర చోట్ల నిఘా నేత్రాలను ఏర్పాటుచేశారు. మండలంలోని గంగవరంలో 13, పులిపాడులో 10, దైదలో 8, తేలుకుట్లలో 15, గొట్టిముక్కలలో 7, సమాధానంపేటలో 4, కొత్త అంబాపురంలో 4, బోదవాడలో 4, గోగులపాడులో 4, పాత అంబాపురంలో 4, పల్లెగుంతలో 3 సీసీ కెమెరాలను అమర్చారు.

డ్రోన్లతోనూ ప్రత్యేక పహారా

పోలీసు అధికారులు డ్రోన్లతో ప్రత్యేక పహారా కాస్తున్నారు. పట్టణ, గ్రామాల శివారుల్లో జూదం, మద్యం తాగుతున్న వారిపై నిఘా ఉంచారు. అలాగే పల్లెల్లో ఘర్షణలకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. నిఘా నేత్రాలను పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. పోలీసులు నిత్యం వీటిని పరిశీలిస్తున్నారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులు ఇలా ప్రార్థనాలయాల వద్ద నిఘాను పెంచారు.

నా వంతు సాయం చేశా: ఎమ్మెల్యే యరపతినేని



అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యతను సీఎం చంద్రబాబు పోలీసుశాఖపై ఉంచారు. వీటి నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయి. ఎమ్మెల్యేగా నా వంతు సాయం పోలీసుశాఖకు అందించాను. ప్రజల భద్రత కూడా నాకు ముఖ్యం.

నేరం చేయాలంటే భయపడాలి: సీఐ భాస్కర్



గురజాల నగర పంచాయతీ, మండల పరిధిలో నేరం చేయాలంటే భయపడాలి. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆర్థికసాయంతో పట్టణ, మండల పరిధిలో ఇప్పటికి 112 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం వాటిని పర్యవేక్షిస్తున్నాం.

సీఎం సహాయనిధి పేదల పాలిట సంజీవని

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, మే 21(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలపాలిట సంజీవని అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో కారంపూడికి చెందిన బక్క శ్రీనివాసరావుకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.30వేల నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కారంపూడి పటణ మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్, ఎస్‌పీఆర్ కృష్ణ, భవిరిశెట్టి పూర్ణ, సాగినబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా..

మాచర్లటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): అధైర్య పడకండి.. అండగా ఉంటానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రోడ్డు ప్రమాద బాధితులకు ధైర్యం చెప్పారు. వెల్దుర్తి మండలం ఉప్పలపాడు హైవేపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు కుక్కమూడి సూరిబాబు, నాగరాజు, రాజులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. చికిత్స వివరాలను వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెల్దుర్తి మండలం టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును బాగు చేయాలి

● సీపీఐ కార్యదర్శి సైదా

కారంపూడి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకంపల్లి నాగులేరు బ్రిడ్జి పక్కన ఉన్న సిమెంట్ రోడ్డును బాగు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా డిమాండ్ చేశారు. బుధవారం వేపకంపల్లిలో జరిగిన సీపీఐ గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం శాఖా కార్యదర్శిగా షేక్ చినసైదులు, సహాయ కార్యదర్శిగా చాంద్‌బాషాలతోపాటు ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో షేక్ వలి, సైదులు, సయ్యద్‌జాను, మౌలాలి, నాగూరు, బ్రహ్మయ్య, నాసర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్యాజువల్ లేబర్‌ను రెగ్యులర్ చేయాలి

పురావస్తు శాఖ డీజీని కోరిన వీరాంజనేయులు

మాచర్లటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న క్యాజువల్ లేబర్‌ను రెగ్యులరైజ్ చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు అన్నారు. బుధవారం ఢిల్లీలోని పురావస్తు శాఖ కార్యాలయంలో డీజీ యదుబీర్‌సింగ్‌రావత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అమరావతి సర్కిల్ పరిధిలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న క్యాజువల్ లేబర్స్, తాత్కాలిక ఉద్యోగులను విధులకు హాజరుకావొద్దని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేసి దాదాపు 150 కుటుంబాలను రోడ్డున పడవేసేందుకు ఒత్తిడి చేస్తున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

రీసర్వేపై అవగాహన సదస్సు

అచ్చంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు భూముల రీసర్వేపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ మాదా ఈశ్వరమ్మతో పాటు రైతులు పాల్గొన్నారు.

నేడు శివాలయ ప్రతిష్ఠా మహోత్సవం

క్రోసూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యందనలో గంగా పార్వతి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. దేవాలయంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠ గురువారం ఉదయం 6 గంటలకు జరుగుతుందని గ్రామపెద్దలు తెలిపారు. రూ.3కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. ఉదయం 11 గంటల నుంచి అన్న సంతర్పణ ఉంటుందన్నారు.

గారపాడులో లోవోల్టేజీ సమస్య పరిష్కారం

పెదకూరపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గారపాడులో విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడంతో బుధవారం గ్రామంలోని నాలుగు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లను విద్యుత్‌శాఖ సిబ్బంది ఏర్పాటుచేశారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు జరపండి

● వీహెచ్‌పీ, భూ రక్షక్ విభాగ్ సభ్యుడు తుమ్మా మర్రెడ్డి


పెదపాలెంలో గోవధ నిషేధ చట్టం అమలు చేయాలంటూ సర్పంచ్ హరిబాబుకు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ, భూరక్షక్ విభాగ్ సభ్యుడు తుమ్మా మర్రెడ్డి

అచ్చంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు జరపాలని జిల్లా గోరక్ష విభాగ సభ్యుడు తుమ్మా మర్రెడ్డి బుధవారం పెదపాలెం గ్రామ సర్పంచ్ నెల్లూరి హరిబాబుకు వినతి పత్రం అందించారు. త్వరలో జరగబోయే పండుగల్లో గోవధ నిషేధాన్ని అమలుజరపాలని, వ్యవసాయానికి ఉపయోగపడే జంతువులను చంపటం సరైంది కాదన్నారు. వ్యవసాయానికి ఆధారమైన ఆవులు, ఎద్దులు, కోడెలు చట్టపరంగా చంపుతున్నారని, ఇది సరైంది కాదన్నారు. జంతు వధను నివారించటానికి గ్రామంలో చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రాంత గోరక్ష సహ ప్రముఖ్ మన్నవ చలపతిరావు, నెల్లూరి చంద్రబాబు, అన్నవరపు వెంకట రామ్మోహనరావు, టీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


షేక్ ఆదం షఫీ

క్రోసూరు, మే 21(ఆంధ్రజ్యోతి): క్రోసూరుకు చెందిన షేక్ ఆదం షఫీ(66) వారం రోజుల నుంచి అదృశ్యమైనట్టు ఆయన భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు క్రోసూరు ఎస్‌ఐ రవిబాబు తెలిపారు. ఆదం షఫీ 14వ తేదీన మెడికల్ షాపులో టాబ్లెట్లు తెచ్చుకుంటానని వెళ్లాడని, తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఆదం షఫీకి మాటలు సక్రమంగా రావని, పక్షవాతంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు క్రోసూరు ఎస్‌ఐ సెల్ నెం.94407 96235 గాని, పోలీసుస్టేషన్ 08640-227133 నెంబరు గాని తెలపాలని కోరారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ


స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేం ప్రవీణ్, లావణ్య దంపతులు


పూజలు చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జలాలపురం గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌లు వేర్వేరుగా పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు స్వామికి విశేష అభిషేకం, ఆకుపూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు సరిపూడి నాగేశ్వరరావు, టీడీపీ మండల శ్రేణులు మద్దినేని వెంకట సత్యనారాయణ, మద్దినేని నరసింహారావు, గంగినేని లీలావతి, అర్తిపట్ల లక్ష్మీనారాయణ, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా మల్లీశ్వరి?

● అధిష్టానానికి పేర్లు ప్రతిపాదించిన ఎమ్మెల్యే జూలకంటి


మల్లీశ్వరి

మాచర్లటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనేక ఇబ్బందులు, కేసులు, ఆర్థిక నష్టాలకు గురిచేసినా పార్టీ మారకుండా భరించి టీడీపీలో కట్టుబడి ఉన్న రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్‌కు మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కనుంది. బీసీ యాదవ సామాజికవర్గానికి చెందిన రాజబోయిన మధుసూదన్‌యాదవ్ వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు. ఆవిర్భావం నుంచి రాజబోయిన కుటుంబం పార్టీలో కొనసాగుతుంది. మధుసూదన్ 1994 నుంచి గొట్టిపాళ్లలో క్రియాశీలకంగా పార్టీలో వ్యవహరిస్తున్నారు. 1995లో గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా, 2000ంలో వెల్దుర్తి మండల పార్టీ ఉపాధ్యక్షుడిగా, 2007నుంచి 2014వరకు మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగారు. 2014 నుంచి 2019వరకు వెల్దుర్తి ఎంపీటీసీ మెంబరుగా బాధ్యతలు నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈ మేరకు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, వైస్‌చైర్‌పర్సన్‌గా మాచర్ల మండలం కొప్పునూరు గ్రామానికి చెందిన గుండాల లక్ష్మీ శ్రీనివాస్‌యాదవ్ పేర్లను ప్రతిపాదించి అధిష్టానానికి పంపారు. త్వరలోనే నియామక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి




ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేస్తున్న యువకులు, ఇన్‌సెట్‌లో డ్రైవర్ శ్రీనివాసరావు

మాచర్లటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): తమ ఆటోకు సైడు ఇవ్వలేదని మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్‌పై యువకులు దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి మాచర్లలో జరిగింది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ39యూఎఫ్ 3155) బుధవారం మార్కాపురం నుంచి మాచర్లకు వస్తోంది. బస్సు వెనుకగా వస్తున్న ఆటో (ఏపీ07 టిఎస్ 1530)కు సైడు ఇవ్వకపోవడంతో ఆటోలోని యువకులు బస్సును వెంబడిస్తూ వచ్చారు. పట్టణ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ కొత్తపల్లి శ్రీనివాసరావు బస్సును రోడ్డు పక్కకు నిలిపారు. పూటుగా మద్యంతాగి బస్సు వెనుకగా ఆటోలో వచ్చిన మాచర్లకు చెందిన తాళ్లూరి పవన, సుతార్ మల్లికార్జున, చరక చంద్ర అనే యువకులు తమ ఆటోకు సైడు ఇవ్వలేదని డ్రైవర్ శ్రీనివాసరావును బస్సులో నుంచి కిందకు దించి విచక్షణా రహితంగా చేతులతో కొట్టారు. స్థానికులు అడ్డుపడడంతో వారు పరారయ్యారు. డ్రైవర్ శ్రీనివాసరావు ముఖంపై గాయాలయ్యాయి. డ్రైవర్ శ్రీనివాసరావు బస్సును ఆర్టీసీ డిపోకు తీసుకొచ్చి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్‌ఐ తురకా వెంకటరమణ కేసు నమోదు చేసి తాళ్లూరి పవన్, సుతార్ మల్లికార్జునలను అదుపులోకి తీసుకున్నారు. చరక చంద్ర పరారీలో ఉన్నాడు.

ఆటో-కారు ఢీ.. నలుగురికి గాయాలు

సత్తెనపల్లి రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆటో-కారు ఎదురెదురుగా ఢీకొనటంతో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని కంటెపూడి సమీపంలోగల చేగుదాబా వద్ద బుధవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. క్రోసూరు మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన తల్లి, కుమార్తె పరుచూరి రాధా, ఉషశ్రీలు తమ బంధువు శ్యామ్‌సాయితో కలసి ఆటోలో విశదల వద్ద గల ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో ఎంసెట్ రాసేందుకు బయలుదేరారు. ఆటో చేగుదాబా వద్దకు రాగానే గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వస్తున్న కారు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న క్రోసూరుకు చెందిన డ్రైవర్ బసులుపాటి సాంబశివరావు, తల్లి కూతుళ్ళు రాధా, ఉషశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. శ్యామ్‌సాయికు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108లో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సాంబశివరావు, రాధా, ఉషశ్రీల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎన్టీఆర్ వీరాభిమాని కొల్లా సైదుబాబు ఇటీవల మృతి చెందటంతో పట్టణానికి చెందిన ఎన్‌టీఆర్ అండ్ ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని కుటుంబసభ్యులకు అందించారు. జూనియర్ ఎన్‌టీఆర్ 42వ జన్మదినం సందర్భంగా ఈ సాయాన్ని అందించినట్టు గౌస్ తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలనే వసూలు చేయాలి

సత్తెనపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని సచివాలయాల్లో డేటా ఎంట్రీ ప్రాసెసింగ్ ఉద్యోగులు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే ప్రజల వద్ద వసూలు చేయాలని తహసీల్దార్ చక్రవర్తి సూచించారు. బుధవారం పట్టణంలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఎడిటింగ్, కొత్తకార్డుల తదితర వాటికి ప్రభుత్వ ఫీజు మేరకు ప్రజలకు సచివాలయ సిబ్బంది సేవలు అందించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి జయంతి వేడుకలు ప్రారంభం

బెల్లంకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ క్రాస్‌రోడ్డు వద్దనున్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయస్వామి జయంతి వేడుకలు వైభవంగా ప్రారంభించినట్టు ఆలయ ఈవో వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామనామ సంకీర్తన, ఆకుపూజా కార్యక్రమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం


అమరావతి: ధ్యానబుద్ధ సమీపంలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పిడుగురాళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర క్యాంపెయిన్ 2025 క్యాంపెయిన్ కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్, తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీఓ రామచంద్రరావు, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, వీవీ నాగేశ్వరరావు, ఎల్‌వీఆర్, సర్వేయర్ శ్రీనివాసరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. జూన్ 21వ తేదీ వరకు ప్రతిరోజు ఈ కార్యక్రమం వుంటుందని కమిషనర్ తెలిపారు.

● మాచవరం: మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులందరూ యోగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. నెలరోజులపాటు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులందరూ యోగాసనాలు వేశారు. కార్యక్రమానికి కమిటీ చైర్మన్‌గా ఎంపీడీవో వెంగళరావు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి, ఏవో ప్రసాదు, ఆర్‌ఐ కోటేశ్వరరావు, ఏపీవో కోటిరెడ్డి, సర్వేయర్ సాల్మన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: యోగాతోనే శారీరక, మానసిక, రుగ్మతలు తొలగిపోతాయని తహసీల్దార్ వైవీ కుటుంబరావు తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీలోని నారాయణపురంలో యోగా భవనంలో అంతర్జాతీయ యోగా మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దాచేపల్లి ఎంపీడీవో పీ రవికుమార్, డీఎల్‌డీవో గబ్రునాయక్, ఈవోపీఆర్‌డీ గుప్తా, యోగా మాస్టరు గోపీ, నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): యోగా వల్ల మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని మునిసిపల్ కమిషనర్ ఆనందకుమార్ అన్నారు. స్థానిక వావిలాల పార్కులో యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరు యోగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్, సచివాలయ సిబ్బంది, ఆర్‌పీలు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: ప్రతిరోజు యోగా చేయటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు యోగా ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏ శ్రీనివాసరెడ్డి, ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● రాజుపాలెం: రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సత్యానారాయణ, తహసీల్దార్ దుర్గేశ్వరరావు ఇతర మండల స్థాయి అధికారులు యోగాసనాలు వేశారు. సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

అమరావతిలో..

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెలరోజుల పాటు రాష్ట్రంలో జరిగే వేడుకలలో తొలిరోజు ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద బుద్ధవనంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యోగా గురువు గిరి స్వామి అధికారులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం హనుమంతరావు, తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో పార్వతి, ఎంఈవో శివబాబు, సీఐ అచ్చియ్య, ఎస్‌ఐ రాజశేఖర్, ఏపీఓ ప్రభావతి, ఏపీఎం కృష్ణప్రియ, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ షేక్ జైనాబ్ జహా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో..


సత్తెనపల్లి: యోగాసనాలు వేస్తున్న మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది

దుర్గి: పరిపూర్ణమైన ఆరోగ్యానికి యోగాసనాలు అవసరమని ఎంఈవో బెంజిమెన్ అన్నారు. వెలుగు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బండ్ల ప్రసాద్, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


పిడుగురాళ్ల: కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శ్రీధర్, తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో రామచంద్రరావు

● రెంటచింతల: రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సరోజనిదేవి, డీటీ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల మండలం జిల్లెళ్ల మూడి గ్రామంలో మరమ్మతులకు నోచుకోని నల్లమడ డ్రెయిన్

నల్లమడ.. గుండె దడ!

వాగుకు వరదొస్తే.. పంటలు మునకే

రూ.కోట్లలో నష్టం..గ్రామాలు జలదిగ్బంధం

ఆధునికీకరణ పనులు హామీలకే పరిమితం

భూసేకరణ, నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

నల్లమడ రైతు సంఘం ప్రధాన డిమాండ్లు

నిపుణుల కమిటీ సూచనలు పూర్తిగా అమలు చేయాలని నల్లమడ రైతు సంఘం డిమాండ్ చేస్తోంది. వాస్తవ వరద నీటిని లెక్కించి కనీసం 500 సివాల్యూవుకు వాగులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరుతోంది. ఇంకా... నిధులు మంజూరు చేసి శాశ్వత వరద నివారణ పనులు చేపట్టాలి. వాగులన్నిటిని అభివృద్ధి చేయాలి. వాగు వంపులను తొలిగించి.. పటిష్టమైన కట్టలు నిర్మించి మలుపులో రివిట్‌మెంట్ చేసి గండ్లు పడకుండా రక్షించాలి. పొలాల్లోని మురుగు పోయేవిధంగా ఇన్లెట్స్ నిర్మించాలి. డెల్టాలోని మీడియం, మైనర్ డ్రెయిన్‌లను అభివృద్ధి చేయాలి. కొమ్మమూరు కాల్వకు ఉన్న ఇన్లెట్‌లు, అవుట్‌లెట్‌ల వ్యవస్థను పునరుద్ధరించాలి. ఎగువ వరద నీటిని తూర్పునకు ప్రవహించేట్లు చేయాలి. నల్లమడ సముద్రంలో కలిసేచోట ఇసుక పూడిక తీయాలి. వాగులను పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు వెంటనే జోక్యం చేసుకొని తగు చర్యలు చేపట్టాలి. నల్లమడ ఎగువన రిజర్వాయర్ నిర్మించాలి.

బాపట్ల, మే21 (ఆంధ్రజ్యోతి) : మూడు జిల్లాల పరిధిలోని లక్షల ఎకరాల ఆయుకట్టు రైతులకు మేలు చేసే నల్లమడ డ్రెయిన్ ఆధునీకీకరణ పనులకు గ్రహణం పట్టింది. ఇప్పటి వరకు నలుగురు ముఖ్యమంత్రులు ఈ ప్రాంతాన్ని సందర్శించి, నల్లమడ ప్రభావిత ప్రాంతాల ప్రజలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆధునికీకరణకు పెద్దఎత్తున హామీలిచ్చారు. అవేవీ.. ఆచరణకు నోచుకోలేదు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని రైతులు పెద్ద ఎత్తున వినతులు అందజేస్తూనే ఉన్నారు. ప్రతిసారి వరదల సమయంలోనే అధికారులు, నాయకులు నల్లమడ సమస్యపై స్పందిస్తూనే ఉన్నారు. ఆ తర్వాత మిన్నకుండిపోతూనే ఉన్నారు. భూసేకరణ చేపట్టి వాగును విస్తరించి.. కట్టలు పటిష్టపరిచి.. ముంపు సమస్య లేకుండా చూస్తామని అనేకమంది నాయకులు హామీలిచ్చారు. నిధులు మంజూరు కోసం నా బార్డుకు ప్రతిపాదనలు కూడా పంపించారు. అయినప్పటికీ నల్లమడ సమస్య రైతులను పట్టి పీడిస్తూనే ఉంది.

భూసేకరణ చేపట్టాలి

నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, కర్లపాలెం మండలాల్లో భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. దీనికి ప్రభుత్వ భూమి 113.58 ఎకరాలు ఉండగా.. 322.89 ఎకరాలు సేకరించాల్సి ఉంది. మొదటి దశలో భూ సేకరణకు కేటాయించిన నిధులు రూ.180కోట్లు కాగా.. రెండో దశలో వాగు విస్తరణ పనుల అంచనా వ్యయం రూ.310 కోట్లని ప్రతిపాదించారు. అయినప్పటికి నిధులు మంజూరు కాలేదు. దీనివల్ల నల్లమడ పరివాహక ప్రాంత రైతుల సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

సీ వాల్యూస్ 500కు పెంచాలి



నల్లమడ డ్రెయిన్ సీ వాల్యూస్ 300గా ఉంది. దీనిని 500కు పెంచాలి. పెదనందిపాడు నుంచి సూర్యలంక సముద్ర తీరం వరకు వంపులు తొలిగించి కట్టలు పటిష్ఠ పర్చాలి. నిపుణుల కమిటీ చెప్పిన విధంగా చేయాలి. వాగులను పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు వెంటనే జోక్యం చేసుకొని ముంపు సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలి.

-డాక్టర్ కొల్లా రాజమోహనరావు, అధ్యక్షుడు, నల్లమడ రైతు సంఘం


కోతకు గురైన నల్లమడ డ్రెయిన్ కట్ట

వరదొస్తే.. ముంపే..!

నల్లమడ వాగు నల్లమల అడవిలో ప్రారంభమై పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సుమారు 165 కిలోమీటర్లు దూరం ప్రయాణించి.. బాపట్ల మండలం సూర్యలంక తీరంలో పొగురు వద్ద సముద్రంలో కలుస్తుంది. ప్రతి రెండుమూడేళ్లకోసారి వాగుకు వరదలు వస్తుంటాయి. అప్పుడు మూడు జిల్లాల్లో వరి, వాణిజ్య పంటలు నీటమునిగి రైతులు రూ.కోట్లల్లో నష్టపోతున్నారు. 2013 అక్టోబరులో అతిపెద్ద వరద వచ్చింది. వాగు గరిష్ఠ వరద ప్రవాహ సామర్థ్యం 24వేల క్యూసెక్కులు కాగా.. 43 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. దీంతో బాపట్ల 40 శాతం ముంపునకు గురైంది. జిల్లెళ్లమూడి గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. లక్ష ఎకరాల్లో పంట దెబ్బతింది. జిల్లాలో 2023 డిసెంబరులో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో వాగు పొంగి కట్టలకు గండ్లు పడ్డాయి. వేల ఎకరాల పంటలు నీటమునిగాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో పర్యటించిన నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే నల్లమడ వాగు ఆధునీకరిస్తామని ప్రకటించారు. దీనిపై నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు సభ్యులతో కలిసి చంద్రబాబు నాయుడుకు సమస్యను వివరించారు. వాగు ఆధునికీకరణ అవశ్యకతను వివరించారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.180 కోట్లు ఖర్చు చేశారని రెండోవ దశలో వాగు విస్తరణకు రూ.310 కోట్లు అవసరమని అంచనా రూపొందించి ప్రతిపాదనలు పంపారు. వైసీపీ పాలనలో పనులు నిలిపివేయడం వల్ల అంచనా వ్యయం పెరిగింది.


వరదల సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లమడ డ్రెయిన్ (ఫైల్‌ఫొటో)



అభిషేక పూజల్లో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ వీరాంజనేయస్వామి

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

❖ వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు


పొన్నూరు టౌన్, మే21(ఆంధ్రజ్యోతి): పొన్నూరులో చరిత్ర ప్రసిద్ధి చెందిన వీరాంజనేయస్వామి దేవస్థానంలో జై..హనుమాన్ నినాదాలు నింగినంటాయి. హనుమజ్జయంతి ఉత్సవాలను దేవస్థానంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి దేవస్థాన క్యూ లైన్లు నిండిపోయాయి. బుధవారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మూల మూర్తికి అభిషేకాలు అనంతరం అలంకరణ పూజలు శాస్త్రయుక్తంగా అర్చక స్వాములు జరిపారు. మధ్యాహ్నం స్వామివారికి ప్రీతికరమైన లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాలు, నివేదన, నీరాజనాలు భక్తిప్రపత్తులతో జరిపారు. సాయంత్రం స్వామి వారి ఉష్ట్ర వాహనంపై నగరోత్సవం కనుల పండుగగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు జై..ఆంజనేయ.. ప్రసన్నాంజనేయ అంటూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారికి భక్తులు వారపోసి టెంకాయలు సమర్పించి హారతులు పట్టారు. ఆలయ ఈఓ గద్దె వెంకట అమర్‌నాథ్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విగ్రహ దాతలు కనిగల్లుల కోటయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న.. సున్నం పరిశ్రమ..!

ఎగుమతులు లేక మూతపడుతున్న బట్టీలు

లబోదిబో మంటున్న వ్యాపారులు

ప్లాట్లుగా మారుతున్న బట్టీ ప్రాంతాలు


పిడుగురాళ్లలోని సున్నంబట్టీ

పిడుగురాళ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే పిడుగురాళ్ల లైమ్‌సిటీగా పేరుపొందింది. అలాంటి సున్నం పరిశ్రమ ప్రతిష్ట నేడు మసకబారుతోంది. ఇక్కడి నుండి అన్ని ప్రాంతాలకు సున్నం ఎగుమతులతో ఎప్పుడూ రద్దీగా వుండే సున్నంబట్టీలు నేడు వెలవెలబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ కాక తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు పిడుగురాళ్ల నుండే సున్నం ఉత్పత్తులు రవాణా జరిగేవి. పిడుగురాళ్ల ప్రాంతంలో ఒకప్పుడు 230 సున్నం బట్టీలు ఉండగా గత ప్రభుత్వాల హయాంలో రాయితీ తగ్గించడం, ఖర్చులు పెరగడంతో క్రమేపి బట్టీలు మూతపడ్డాయి. గత ఐదేళ్లలో సుమారు 80 బట్టీలు నిరాటంకంగా తమ ఉత్పత్తులను రాష్ట్రాల వ్యాప్తంగా ఎగుమతులు సాగించిన సున్నం వ్యాపారుల పరిస్థితి నేడు చతికిలపడ్డట్టు అయింది. ప్రస్తుతం సుమారు 35 బట్టీలే సున్నం ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి.

గృహనిర్మాణ అనుమతులు లేకపోవడం.....

సున్నంబట్టీల ద్వారా రెండు రకాల ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తాయి. చెక్కరాయితో వచ్చిన సున్నం ఉత్పత్తి హలో బ్రిక్స్ తయారీకి, చేపల చెరువుల వాడకానికి విరివిగా ఉపయోగిస్తారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుక కొరత ఏర్పడటంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో చెక్కరాయితో తయారైన సున్నం ఉత్పత్తికి రాష్ట్ర వ్యాప్తంగా గిరాకీ పడిపోయి ఆ ప్రభావం నేటికీ కనిపిస్తున్నది. తెల్లరాయితో ఉత్పత్తి అయ్యే సున్నం కొన్ని రాష్ట్రాలకు ప్రస్తుతానికి ఎగుమతుల పర్వం కొన్నాళ్లుగా తగ్గుముఖం పట్టింది. దీనికి కారణం బొగ్గురేటు, సున్నంరేటు పెరగడంతో కొనుగోలు అంత ధర చెల్లించక పోవడంతో పాటు షుగర్ ఫ్యాక్టరీల నుండి అంతకు ముందున్న మాదిరిగా భారీగా ఆర్డర్లు దక్కకపోవడమే కారణంగా చెప్పవచ్చు.

రాజస్థాన్ నుంచి కొనుగోలు

ఇప్పటి దాకా పిడుగురాళ్ల నుండి పలు రాష్ట్రాలకు సున్నం ఉత్పత్తులు రవాణా అయ్యేవి. గత కొన్నేళ్లుగా రాజస్థాన్‌లో పెట్టిన సున్నంబట్టీల నుండి తయారయ్యే సున్నం ఉత్పత్తులు మరికొన్ని రాష్ట్రాలకు సరఫరా అవుతుంది. పిడుగురాళ్లలో తయారయ్యే సున్నం ఉత్పత్తుల్లో క్వాలిటీ, ప్యూర్ వైట్ కన్నా అక్కడ తయారయ్యే సున్నం ఉత్పత్తుల్లో 90 శాతం క్వాలిటీ, ప్యూర్ వైట్ లభిస్తుండటంతో కొన్ని రాష్ట్రాల వ్యాపారులు రాజస్థాన్ నుండి సున్నం ఉత్పతుల కొనుగోలుకు మొగ్గు చూపుతుండటంతో పిడుగురాళ్ల నుండి కొన్ని రాష్ట్రాలకు చాలా కాలంగా జరుగుతున్న సున్నం ఎగుమతులలో స్తబ్ధత ఏర్పడటంతో వ్యాపారులు అయోమయా నికి గురవుతున్నారు. దీంతో సున్నం వ్యాపారం ఒడిదుడుకుల తో వ్యాపారులు, సున్నం పరిశ్రమకు గడ్డు కాలం ఏర్పడే అవకాశం వుంది.

కూలీల కొరత కూడా కారణం

ఒకప్పుడు సున్నం మిల్లులు, బట్టీలలో పనిచేసేందుకు పొరుగు జిల్లాలైన నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు పిడుగురాళ్ల సమీప మండలాలకు చెందిన వేలాది మంది కుటుంబాలతో సహా ఉపాధి దొరికేది. తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తే సరాసరి సగటున వెయ్యి రూపాయలు చేతికొచ్చేవి. ప్రకాశం జిల్లా నుండి ఒకానొక సమయంలో లెక్కకు మించి వచ్చే కార్మికుల వలస ఇప్పుడు తగ్గిపోయింది. అయా ప్రాంతాలలో వ్యవసాయ ఆధారిత పంటలు, బోర్లు, విద్యుత్ సౌకర్యాలతో పంటలు సాగు చేసుకునే సదుపాయం వుండటంతో ఇక్కడికి వచ్చి సున్నం బట్టీలు, మిల్లుల్లో పనిచేసే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది.

బట్టీల స్థానంలో ప్లాట్లు

దశాబ్దాల కాలం పాటు లైమ్‌సిటీలో పేరొందిన సున్నం బట్టీల ప్రాంతం ఒకప్పుడు కళకళలాడేది. కొన్ని వందల మందికి బతుకుదెరువును చూపిన సున్నం బట్టీలు కాలం కలిసిరాక, ప్రభుత్వాల నుండి రాయితీలు అందక ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. కొందరు మాత్రమే మరో వ్యాపకం లేక సున్నం బట్టీని కాల్చి వ్యాపారం చేస్తుండగా మరికొందరు మాత్రం ఇంకెందుకు అంటూ బట్టీలను తొలగించి ఆ ప్రదేశాన్ని ప్లాట్లుగా వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.


రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మారిన సున్నం బట్టీ ప్రాంతం

అకాల వర్షం.. పొంగి పొర్లిన వాగులు


గంగుపల్లి - కంద్రిక మధ్యలో పొంగి ప్రవహిస్తున్న వాగు

బొల్లాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంట్లపల్లి, కంద్రిక, గుంగుపల్లి గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గత పది రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. గుంట్లపల్లి - కంద్రిక మధ్యలో వాగు పొంగి ప్రవహించడంతో ఆ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. అదే విధంగా గుంట్లపల్లి వద్ద వాగు కూడా భారీ ప్రవహించడంతో గుట్లపల్లి నుంచి పుల్లల చెరువు వెళ్లే వాహనాలు నిలిచి పోయాయి. వాగు ఉధృతి తగ్గాక యథావిధిగా వాహనాలు నడిచాయి.


గుట్లపల్లి వద్ద భారీగా ప్రవహిస్తున్న వాగు

రైల్వేలో ఉగ్రవాద వ్యతిరేక దినం

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో బుధవారం ఉగ్రవాద వ్యతిరేక దినం పాటించారు. గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లు, కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ గుంటూరు - మాచర్ల, న్యూ పిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్లలో తనిఖీలు నిర్వహించి ఉద్యోగులతో హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు తోటి వారితో శాంతియుతంగా ఉండాలన్నారు. సామాజిక సామరస్యం పాటించాలని సూచించారు. ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు

● దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్

శావల్యాపురం, మే21(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుండి గుంతకల్ రైల్వే మార్గంలో శావల్యాపురం నుండి కారుమంచికి వెళ్లే దారిలో ఉన్న 268 రైల్వే గేటు వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌యూబీ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా నడికూడి నుండి మాచర్ల వరకు రైల్వే స్టేషన్‌లను ఆమె బుధవారం సందర్శించారు. శావల్యాపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ప్లాట్ ఫాం పనుల పురోగతిని పరిశీలించారు. ఇక్కడ కరోనా సమయంలో నిలిపివేసిన రైళ్ల స్టాపింగ్‌లను పునరుద్ధరించాలని, నడికుడి, మార్కాపురం మధ్య ప్రత్యేక రైలును ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెను కోరారు. ప్రజాప్రతినిధుల ద్వారా లిఖితపూర్వక వినతిపత్రం అందజేస్తే రైల్వే ఉన్నతాధికారులకు పంపించి పరిష్కరిస్తామని డీఆర్ఎం సమాధానం ఇచ్చారు. అనంతరం స్టేషన్ మాస్టర్ మధుబాబుతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సుబ్బారావు, రత్నాకర్, శ్రీనాథ్, ప్రదీప్ పాల్గొన్నారు.


ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఈపూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈపూరు స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండలం అన్నవర ప్పాడులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా మద్యంను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ నిరుద్యోగ యువకులకు ఉద్యోగావకాశాలు

శావల్యాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ, స్కిల్ డౌలప్‌మెంట్, లిడ్‌క్యాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువకులకు లెదర్ టెక్నాలజీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ అవకాశాన్ని ఎస్సీ నిరుద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని జాబ్స్ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ గుంటూరులోని నల్లపాడు వద్దనున్న లిడ్‌క్యాప్ ట్రైనింగ్ సెంటర్‌లో లెదర్ వస్తువుల కటింగ్, స్టిచ్చింగ్‌ల్లో 45రోజులు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి 18 నుంచి 35ఏళ్ళ మధ్య వయసు ఉన్న ఎస్సీ నిరుద్యోగ యువకులకు శిక్షణ ఇచ్చి పూర్తయ్యాక ప్రముఖ ఎంఎన్‌సీ, ప్రైవేటు కంపెనీల్లో వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని, ఉద్యోగంపై ఆసక్తి లేనివారు సొంత వ్యాపారం చేసుకోవచ్చని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వారికి ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందన్నారు. శిక్షణకు హాజరైన అభ్యర్థులకు ఉచితంగా హాస్టల్, భోజనం సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 7288059665ను సంప్రదించాలన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

● సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం

రొంపిచర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు బుధవారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో సీపీఐ గ్రామశాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైరుతీ రుతు పవనాలు వస్తున్న సందర్భంగా ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీనివల్ల పొలాలు చదును అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కల్తీలేని విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ముప్పురి మధుసూదనరావును గ్రామ శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బావిలోపడి మహిళ మృతి



నాగలక్ష్మి (ఫైల్ ఫొటో)

వినుకొండ టౌన్, మే 21, (ఆంధ్రజ్యోతి) బావిలోపడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని నడిగడ్డలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలను ప్రకారం నడిగడ్డ గ్రామానికి చెందిన దాడిపర్తి నాగలక్ష్మి (50) గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఉన్న తాగునీటి బావి వద్ద నీటికోసం వెళ్లి బావిలోపడి మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే నాగలక్ష్మి మృతి చెందడంతో భర్త వెంటేశ్వర్లు పోలీసులకు సమాచారం చేరవేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుపై టెండర్లకు ఆహ్వానం

నరసరావుపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళలో ఖాళీగా ఉన్న స్థలంను 15సంవత్సరాలు వాపారాల నిమిత్తం అద్దె ప్రాతిపదికన టెండర్లుకు ఆహ్వానించారు. ఈ నెల 23న ఉదయం 11.00 గంటలకు పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి చాంబర్‌లో పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు తెలిపారు. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ ప్రాంగణములో 0 ఎస్-15 ప్రాతిపదికన స్థలాలపై పారిశ్రామిక వేత్తలకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ మృతి



ఎంఎస్ రాజు

వినుకొండ టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) వినుకొండ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎంఎస్ రాజు అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన గతంలో గురజాలలో పనిచేస్తూ వినుకొండ సబ్ రిజిస్టర్ కార్యాలంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఇటీవల బదిలీ అయ్యారు.

అధ్వానంగా మురుగు పారుదల

● డ్రెయిన్లు ఉన్నా రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు ● వ్యాధుల భయంతో గ్రామస్థులు



పెదకొండాయిపాలెం ఎస్సీకాలనీలో రోడ్డుపై చేరిన మురుగునీరు



ఈపూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లు ప్రవహిస్తూ ప్రజా జీవనానికి ఆటంకం మారుతోంది. మండలంలోని ఎస్సీ కాలనీలలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని ప్రాంతాలలో సైడ్ డ్రెయిన్స్ ఉన్నప్పటికీ మురుగునీరు ప్రవహించే పరిస్థితి లేదు. కొందరు సైడ్ కాలువలను కూడా ఆక్రమించారు. పెదకొండాయిపాలెం ఎస్సీ కాలనీలో ఒకవీధిలో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. యర్రబాలెం, కొచ్చర్ల, కొండ్రముట్ల, అగ్నిగుండాల, ఉప్పరపాలెం గ్రామాలలో సైడ్ డ్రెయిన్లు ఆక్రమణలకు గురికావడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. వేసవికాలంలో కూడా మురుగు నీరు రోడ్లపై నిల్వఉండడంతో ఆప్రాంతాలలో నివశించేవారికి ఇబ్బందిగా ఉంది. రోడ్డుపై మురుగునీరు దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందుతాయనే భయాందోళనలో గ్రామస్థులు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆక్రమణలను తొలగించి సైడ్ కాల్వలను అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



యర్రబాలెంలో సీసీ రోడ్డుపై చేరిన మురుగునీరు

గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

వినుకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన జరగనున్న హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం మాలధారణ స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు, దేవాలయ ఆవరణలో హోమాలు నిర్వహించారు. అనంతరం దేవస్థానానికి వచ్చే భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గుంటి ఆంజనేయస్వామి, పూజల్లో పాల్గొన్న మాలధారణ స్వాములు, భక్తులు

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని

శావల్యాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి గ్రామాల్లోని ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా సర్వసభ్య సమావేశానికి వేల్పూరు, ఇర్లపాడు, గుంటుపాలెం, ముండ్రువారిపాలెం, పిచికలపాలెం సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. 11ఎంపీటీసీ స్థానాలకుగాను కారుమంచి-1, మతుకుమల్లి ఎంపీటీసీలు గైహాజరయ్యారు. ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ మనబడి- మన భవిష్యత్తు పథకం ద్వారా మతుకుమల్లి జడ్పీ పాఠశాల, బొందిలిపాలెం మెయిన్, వయ్యకల్లు ఎస్సీ పిచికలపాలెం ఎస్సీ, శానంపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలల్లో మరమ్మతులకు ప్రభుత్వం రూ.8,60,075 నిధులను మంజూరు చేసిందన్నారు. పీఎంశ్రీ పథకం ద్వారా శావల్యాపురం జడ్పీ పాఠశాలలో క్రీడామైదానం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం 8.60లక్షలు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయన్నారు. శావల్యాపురం మెయిన్, పోట్లూరు మెయిన్, హెచ్‌సీ, కనమర్లపూడి మెయిన్, కారుమంచి హెచ్‌సీ, మతుకుమల్లి హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసిందన్నారు. ఎంఏవో రామారావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి 11 సచివాలయాల నుంచి 12,945 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి ప్రభుత్వ అనుమతికోసం పంపామన్నారు. తహసీల్దార్ అర్జున్‌నాయక్ మాట్లాడుతూ అర్హతున్న లబ్ధిదారులంతా రేషన్ కార్డులకు కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శానంపూడి అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని సీడీపీవో అనురాధ విద్యుత్ ఏఈ నటరాజ్ దృష్టికి తీసుకెళ్ళగా మీటర్‌కు చలానా కడితే ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఈవో స్పందించి పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని తెలుపగా దానికి సంబంధించిన జీవో తమకు రాలేదని ఏఈ తెలిపారు. వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ డ్రైవ్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు 23 కంపెనీలు హాజరుకాగా 675మంది హాజరయ్యారు అందులో 265 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. జాబ్ మేళాలో ముఖ్య అతిధిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు విచ్చేసి మాట్లాడుతూ జాబ్‌మేళాను నరసరావుపేటలో నిర్వహించడం చాలా సంతోషకరం అన్నారు. ఉద్యోగం పొందిన ప్రతిఒక్కరూ చిన్న ఉద్యోగం అని శాలరీ తక్కువ అని ఆగకుండా ప్రతి ఒక్కరూ జాబ్ వచ్చిన కంపెనీలో జాయిన్ అవ్వాలన్నారు. నియామక పత్రాలు అందుకున్న యువతకు అభినందలు తెలిపారు. మరో ముఖ్య అతిధి గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యోగంలో చేరి నైపణ్యాన్ని పెంపొందించుకుంటూ ఉన్నత శిఖరాల అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఈ తమ్మాజీరావు, బి.ఝాన్సీరాణి, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి యం. రవీంద్ర నాయక్, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా సిబ్బంది, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన యువకులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

కోర్టు భవనానికి స్థలం కేటాయించరూ...

● ఎమ్మెల్యే ప్రత్తిపాటికి న్యాయవాదుల వినతి

చిలకలూరిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును చిలకలూరిపేట బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు బుధవారం కలసి వినతి పత్రాన్ని అందచేశారు. స్పందించిన ప్రతిపాటి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని దూడలు మృతి

నాదెండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త బైపాస్‌పై గుర్తు తెలియని వాహనాలు ఢీకొని రెండు దూడలు మృతిచెందగా మరో రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. నాదెండ్ల సమీపంలోని జాష్టివారిపాలెంకు చెందిన మార్తా హనుమంతరావు, మార్తా వీరాంజనేయులుకు చెందిన రెండు గేదెలతో పాటు రెండు దూడలను పొలంలోకి వదిలాడు. ఐతే దూడలు కొత్త బైపాస్ పైకి వెళ్ళటంతో గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్నాయి. ఈ విషయాన్ని పశు పోషకులు బుధవారం గుర్తించారు. ఒక్కొక్క దూడ రూ20వేలకు పైగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటోను ఢీకొన్న ప్రైవేట్ బస్సు: ముగ్గురికి గాయాలు

నాదెండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని భారత్ గ్యాస్ కంపెనీ సమీపంలోని జాతీయ రహదారిపై చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఆటోను ఒక ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కారసాల సుబ్బారావు, నాగ జ్యోతి అనే ప్రయాణికులు గాయపడ్డారు. ఒకరిని చిలకలూరిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి, మరొకరిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. స్వల్పంగా గాయపడ్డ వల్లపు వెంకటేశ్వర్లును చిలకలూరిపేటలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు ఈ విషయమై కారసాల సుబ్బారావు ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఈకి వినతి

ఈపూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఈ విజయ్‌కుమార్‌కు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య వలన గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సచివాలయాల్లో పడకేసిన కార్యకలాపాలు

● పంచాయతీ కార్యదర్శుల ఆదేశాలు పాటించని సిబ్బంది

రొంపిచర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సచివాలయాల్లో విధులు నిర్వహించే పలువురు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రధానంగా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లపై ఇక్కడ ప్రధానంగా పనులు సాగుతుంటాయి. ఐతే పింఛన్లు జారీ చేసే సమయంలో మినహాయించి పలువురు ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆయా గ్రామాల్లోని నాయకుల మాటలు కూడా పలువురు సిబ్బంది పెడచెవిన పెడుతున్నారు. దీంతో నాయకులపై కూడా ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగినా సమాధానం చెప్పటం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో లబ్ధిదారులు, ప్రజలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. మండల పరిషత్ అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో ఇబ్బందికరంగా మారుతోంది. పలు సచివాలయాల్లో సిబ్బందిపై విమర్శలు రావటంతో వారిని అంతర్గతంగా ఇటీవల బదిలీ చేశారు. ఆధార్ సేవలు నామమాత్రంగా సచివాలయాల్లో నిర్వహిస్తుండటంతో విద్యార్థులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా సమస్యలను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్యామ్ కృపాకర్

నాదెండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎరసాని శ్యామ్ కృపాకర్‌కు డాక్టరేట్ లభించింది. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని ప్రభావితం చేసే కారకాలు, ఉపాధ్యాయ వృత్తి పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.ఎస్తేరు సునీల పర్యవేక్షణలో ఆయన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. విశ్వ విద్యాలయ ఉప కులపతి, ప్రొఫెసర్ కే గంగాధర్ నుంచి ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కృపాకర్‌ను ప్రిన్సిపాల్ సీహెచ్ ఝాన్సీవాణి, బోధనా, బోధనేతర సిబ్బంది అభినందించారు.



గోవిందపురంలో భీమేశ్వరస్వామి వారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వైభవంగా భీమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చిలకలూరిపేట, మే21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం గోవిందపురంలోని గంగా పార్వతి సమేత భీమేశ్వరస్వామి వారి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య గంగా పార్వతి సమేత భీమేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, శనీశ్వరుడు తదితర విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో స్వామివార్లను సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు 10వేల మందికి అన్నదానం చేశారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌లు దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితోపాటు జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, మామిళ్లపల్లి గోపి, కుందుర్తి రాఘవయ్య, రామకోటయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఈవో లక్ష్మయ్య పర్యవేక్షించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: శిక్షకురాలు రాజ్యలక్ష్మి

నాదెండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు, యోగా శిక్షకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 21న నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంపై వివిధ శాఖల సిబ్బందికి అవగాహన, శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సర్వ రోగాల నివారణకు యోగా ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రతిరోజు కనీసం అరగంటకు పైగా యోగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎంఈవో కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా గుడి వద్ద యోగా చేస్తున్న పురప్రముఖులను అభినందిస్తున్న కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

ఘనంగా యోగా మాసోత్సవం

వినుకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వినుకొండ పురపాలక సంఘంలో అంతర్జాతీయ యోగా మాసోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లయోలా స్కూల్, ఎన్ఎస్‌పీ సాయిబాబా గుడి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు పాల్గొని యోగా చేస్తున్న వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల శారీరక బలం, మానసిక ప్రశాంత పెరుగుతుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి సతీమణి, కౌన్సిలర్ షకీలా మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని సులభంగా జయించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు పి.వి.సురేష్, రెడ్డి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



యోగా శిక్షణలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో

నూజెండ్లలో...

నూజెండ్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో బుధవారం యోగాంధ్ర 2025 కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్ కుమార్, ఎంపీడీవో పీ ఉమాదేవి, ఎంఈవో రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ వెంకట రత్నం, ఏపీవో ఆంజనేయ రాజు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ఉదయం 10 గంటలకు మూసి ఉన్న అంగన్ వాడీ కేంద్రం

సమయపాలన పాటించని అంగన్‌వాడీ కేంద్రం

● అన్నవరం కేంద్రం ఆయాలకు మెమో జారీ

రొంపిచర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరంలో అంగన్‌వాడీ కేంద్రం-1, అంగన్‌వాడీ కేంద్రం-2లను కలిపి నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయం వెనుక ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 8గంటల నుంచి నిర్వహించాల్సి ఉంది. ఐతే బుధవారం 10గంటలైనా అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తెరుచుకోలేదు. ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ హెల్పర్లకు, 15వ తేదీ నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు సెలవులు ఉన్నాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ హెల్పర్లు విధుల్లో ఉండాల్సి ఉంది. ఐతే అంగన్‌వాడీ కేంద్రం తలుపులు తెరుచుకోలేదు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఈ విషయంపై సూపర్‌వైజర్ దేవీబాయిని వివరణ కోరగా కేంద్రాన్ని తనిఖీ చేశామని, సంబంధిత ఆయాలకు మెమోలు జారీ చేసినట్టు పేర్కొన్నారు.